విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

జిల్లా ప్రజలు, అధికారుల సహకారంతో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

జేసీ ప్రవీణ్ ఆదిత్య

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా ప్రజలు, అధికారుల సహకారంతో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కాకినాడ జిల్లా నూతన సంయుక్త కలెక్టర్(జేసీ) సీ ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లా జేసీగా నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి, డీఆర్డీఏ పీడీ కె. శ్రీరమణి, పౌరసరఫరాల సంస్థ డీఎం డి. పుష్పమణి, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, ఏడి సర్వే బి లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ విభాగాల అధిపతులు పలువురు ఇతర అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : నేటి ఆధునిక కాలంలో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల్ని ప్రోత్సహించడం చాలా ముఖ్యం అని కలక్టర్ కే. మాధవీలత, ఎంపి మార్గనీ భరత్ రామ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవి లత మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో యువతకు శారీరక శ్రమ తగ్గి మొబైల్ ఫోన్లు వంటి వాటిపై ఎక్కువగా దృష్టి సారించడం జరుగుతోందని అన్నారు. యువతీ యువకులు పెద్ద ఎత్తున క్రీడల్లో పాల్గొనడం శుభ పరిణామ మని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రపంచ స్థాయి ఛాంపియన్ లు వై. లలితాదేవి, ఐశ్వర్య, పి శివాజీ, ఎం.లక్ష్మి, కె. రాజేష్, జి. భవానిలను జిల్లా కలెక్టర్, ఎంపి చేతుల మీదుగా సన్మానం చేసి సత్కరించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందని పార్లమెంట్ సభ్యులు మార్గనీ భరత్ రామ్ పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్ట మొదటగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం కోకో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడా కోర్టులను ప్రారంభించి, క్రీడా పోటీలను ఆరంభించారు. తొలుత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యులు, మున్సిపల్ కమిషనర్, జిల్లా జాయింట్ కలెక్టర్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అమలాపురంలో 90వ రోజు మహా సంకల్ప యాత్ర

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణంలోని 19వ వార్డులో మహాసంకల్ప యాత్ర 90 రోజు కార్యక్రమం జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చిక్కాల సతీష్ అధ్యక్షతన జరిగింది. వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు రెండు చోట్ల జనసేన జెండా స్తూపాలను ఆవిష్కరణ చేశారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా చోట్ల నీరాజనాలు, హారతులు, శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు జనసేన నాయకులు, వీర మహిళలు, యువకులు పెద్దలు దాదాపు 1000 మందితో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు మహదశ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి శ్రీనుబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు, మున్సిపల్ కౌన్సిలర్ గండి దేవి హారిక, వీర మహిళలు పాల్గొన్నారు.

చకచకా జరుగుతున్న ఇందిరా కాలనీ డ్రైనేజీ పనులు

విశాలాంధ్ర - రావులపాలెం : గత ప్రభుత్వంలో శిలాఫలకానికే పరిమితమైన పనిని జగనన్న ప్రభుత్వంలో పూర్తి చేసి చూపనున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి. ఏళ్ల తరబడి పేరుకు పోయిన మురుగుతో అవస్థలు పడుతున్న ఇందిరా కాలనీ వాసుల బాధ విన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వెంటనే డ్రైనేజీ నిర్మాణం మొదలు పెట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తాం అని కొన్ని రోజుల క్రితం మాట ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే జగ్గిరెడ్డి పనులను ప్రారంభింపచేసి, నేడు శరవేగంగా జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు అందచేశారు.

ఆదిత్యలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య విద్యా ప్రాంగణం సూరంపాలెంలో మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డాక్టర్ సుగుణ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆదిత్య వ్యవస్థాపక సభ్యులు, ఆదిత్య విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ నల్లమిల్లి లక్ష్మీరాజ్యం జన్మదినం (ఆదిత్య వ్యవస్థాపక దినోత్సవం-ఫౌండర్స్-డే) సందర్భంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాలలో గల ప్రముఖ బ్లడ్ బ్యాంక్ కాకినాడ, రాజమండ్రి, రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు కాకినాడ లోని సిద్దార్థ వాలంటరీ బ్లడ్ బ్యాంకు, రోటరీ, ఇండియన్ రెడ్ క్రాస్, యువసేన బ్లడ్ బ్యాంకు, మరియు రాజమండ్రిలోని విజయశ్రీ, వైఎస్ఆర్ జక్కంపూడి రామ్మోహన్ రావు బ్లడ్ బ్యాంకు రాజమండ్రి, రోటరీ బ్లడ్ బ్యాంకు పెద్దాపురం వారు రక్తాన్ని సేకరించటం జరిగింది సుగుణ రెడ్డి తెలియజేశారు.

ఇళ్ల స్థలాల అవకతవకలపై ఉద్యమం

విశాలాంధ్ర-గోకవరం : గోకవరం గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల విషయంలో వైసిపి నాయకులు కావాలనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఇది మంచి పద్ధతి కాదని తెలుగుదేశం పార్టీ నాయకులు, సొసైటీ మాజీ చైర్మన్ గాజింగం సత్తిబాబు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న టిడిపి కార్యాలయం వద్ద సత్తిబాబును లబ్ధిదారు మహిళలు కలిశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ గోకవరం గ్రామంలో 11వ,12వ వార్డులలో మహిళలకు గతంలో ఇండ్ల స్థలములు మంజూరయ్యాయని, లబ్ధిదారు మహిళలలో కొంతమందికి మాత్రమే పట్టాలు ఇవ్వడం జరుగుతుందని, కొంతమంది మహిళలను కావాలని వైసీపీ నాయకులు కక్షపూరితంగా వేధిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని సత్తిబాబు అన్నారు. లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి న్యాయం జరగకపోతే ప్రభుత్వాన్ని స్తంభింపజేసే విధంగా ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని సత్తిబాబు హెచ్చరించారు.

రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా శాఖ వారు విభిన్న సేవా కార్యక్రమాలతో సమాజానికి చేస్తున్న సేవలను గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. బుధవారం జెఎన్‌టియు అతిథి గృహం వద్ద 45 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన "లకంసాని విరిసీ మానస్ రెడ్ క్రాస్ ఐ బ్యాంకు" ప్రారంభోత్సవం, రూ. 1.30 కోట్లతో నిర్మిస్తున్న" రెడ్ క్రాస్ శిశు, మహిళా సంక్షేమ, శిక్షణా కేంద్ర" నిర్మాణానికి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ కాకినాడ రెడ్ క్రాస్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామా రావులను అడిగి తెలుసుకుని రాష్ట్రంలో మన జిల్లా రెడ్ క్రాస్‌ను ప్రథమ స్థానంలో నిలబెడుతున్నందుకు గవర్నర్ వారిరువురిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారి సాంకేతిక సహకారంతో అత్యాధునిక పరికరాలతో రెడ్ క్రాస్ ఐ బ్యాంకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్వరలోనే ప్రతాప్ నగర్‌లో మహిళా శిక్షణా కేంద్రం నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ వై డి రామారావు ఐ బ్యాంకు ఏర్పాటుకు 45 లక్షల విరాళాన్ని అందించిన శ్రీ సాయి రామా ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత లకంసాని సత్యనారాయ ణను మహిళా శిక్షణా కేంద్ర నిర్మాణానికి 43.33 లక్షల విరాళాన్ని అందించిన జెమిని ఎడిబుల్ ఆయిల్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావులను గవర్నర్‌కు పరి చయం చేయగా గవర్నర్ వారికి పుష్ప గుచ్చాలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ ఎ. శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ సిహెచ్ నాగ నరసింహ రావు, జిల్లా శాఖ వైస్ చైర్మన్ సుగుణ, కార్యదర్శికి శివ కుమార్, కోశాధికారి ఎన్‌వివిఆర్‌కె ప్రసాద్ బాబు, ఇంజినీర్ ఎస్‌విఎం చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే కుటుంబ సంక్షేమం

విశాలాంధ్ర - కాకినాడ : మహిళలు అభివృద్ధి చెందినప్పుడే ఆకుటుంబం అన్ని రంగాల్లోను ప్రగతి సాధించగలదని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అందువల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం కాకినాడలోని మూడు ప్రాంతాల్లో వేడుకగా సాగింది. స్థానిక వార్ఫురోడ్డు, గాంధీనగర్ పార్కు, చీడీలపొర ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షత వహించారు. వైఎస్ఆర్ ఆసరాకు సంబంధించిన మెగా చెక్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి విడుదల చేశారు. సీఎం జగన్ చిత్రపటానికి ఆర్‌పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల సమక్షంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కాకినాడలో పేదలకు కేటాయించిన 31వేల ఇళ్ళ స్థలాల పట్టాలను మహిళల పేరుతోనే ఇచ్చామన్నారు. వీటితోపాటు మరెన్నో సంక్షేమ పథకాలను మహిళలకు అందేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో ఎన్నో పేద కుటుంబాల్లో మహిళలకు మంచి గౌరవం దక్కిందన్నారు. కుటుంబ పోషణలో సైతం మహిళలు క్రియాశీలపాత్ర పోషించే స్థాయికి ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మైనార్టీ, బీసీసెల్ ప్రాంతీయ సమన్వయ కర్తలు అబ్దుల్‌బషీరుద్దీన్, అల్లిరాజబాబు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గవర్నర్ నజీర్‌కు గైట్లో ఘన స్వాగతం

విశాలాంధ్ర - రాజానగరం : జిల్లా పర్యటనకు తొలిసారిగా విచ్చేసిన ఏపీ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘన స్వాగతం లభించింది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రముఖులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కాకినాడ నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గైట్ కళాశాలలోని హెలిప్యాడ్ వద్దకు గవర్నర్ నజీర్ బుధవారం మధ్యాహ్నం చేరుకున్నారు. దీనిలో భాగంగా హెలిప్యాడ్ వద్దకు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవి లత, ఎస్పీ పి.జగదీష్, జెసి ఎన్.తేజ్ భరత్, నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు, రాజమహేంద్రవరం ఆర్డీవో ఎ.చైతన్య వర్షిణి, నన్నయ వర్సిటీ రిజిష్టర్ ఆచార్య జి. సుధాకర్, అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ శేఖర్,చైతన్య విద్య సంస్థల చైర్మన్ కెవివి సత్యనారాయణ రాజు(చైతన్య రాజు), బీజేపీ నాయకులు నిరుకొండ వీరన్న చౌదరి తదితరులు పుష్ప గుచ్చాలు అందించగా,గైట్ యాజమాన్యం ప్రత్యేక జ్ఞాపిక అందించి దుశ్శాలువతో కప్పి సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం హెలిప్యాడ్ నుండి నన్నయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం వేడుకలకు తరలి వెళ్లగా అక్కడ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అందించిన గౌరవవందనాన్ని స్వీకరించారు. గవర్నర్ రాకతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌ను నిలిపివేయ డంతో వాహనదారులు ఇబ్బందులు చవిచూశారు.

అందరూ కలిసి పని చేద్దాం... వైసీపీని మరోసారి గెలిపిద్దాం

విశాలాంధ్ర - పి గన్నవరం : అందరూ కలిసి పని చేద్దాం వైసీపీని మరోసారి గెలిపిద్దామని జిల్లా పరిషత్ చైర్మన్ పి. గన్నవరం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వేణు గోపాలరావు పిలుపునిచ్చారు. అంబాజీపేట మండలం నుండి ఆయనను కలిసేందుకు వచ్చిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో మాట్లాడుతూ తాను కూడా వైసీపీలోలో కార్యకర్త స్థాయి నుండే ఎదిగానని అన్నారు. అనంతరం ఫిబ్రవరి 3వ తేదీన సీఎం జగన్ ఏలూరులో నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభ గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ బహిరంగ సభను వైకాపా నాయకులు కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

3న 'సిద్ధం' సభకు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : సీఎం జగన్మోహన్ రెడ్డి వైసిపి క్యాడర్‌కు దిశా నిర్దేశం చేసేందుకు ఏలూరులో ఫిబ్రవరి 3న నిర్వహించే' సిద్ధం' సభకు ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి వైసిపీ శ్రేణులు తరలి రావాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. 2024 ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం వైయస్ జగన్ 'సిద్ధం' పేరుతో ఏలూరులో ఫిబ్రవరి 3న సభను ఏర్పాటు చేస్తున్నారని ఈ సభకు 50 కార్లు, 50 బస్సులలో నియోజకవర్గం నుండి వెళ్తున్నట్లు వరుపుల సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి అభివృద్ధిని, సంక్షేమాన్ని నమ్ముకునే ఎన్నికలకు వెళ్తున్నారని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని, వచ్చే ఎన్నికలు పేదలకు ఎంతో కీలకమని, ప్రతి పేదవాడికి సంక్షేమం అందాలంటే మరలా వైసిపి రావాలని వరుపుల అన్నారు.

నేను లోకల్..దవులూరి

విశాలాంధ్ర - సామర్లకోట : నేను లోకల్ స్థానిక నాయకత్వాన్ని గెలిపించండి ప్రజలకు సేవ చేస్తాను. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ పార్టీ నెరవేరిస్తుందో ఆపార్టీని ప్రజలు గెలిపించాలని వైఎస్ఆర్‌సీపీ పెద్దాపురం నియోజక వర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని 1864 మంది డ్వాక్రా మహిళలకు రూ.1,36,75,827లు వైఎస్ఆర్ ఆసరా పథకం క్రింద చెక్కులు పంపిణీ కార్యక్రమం స్థానిక తోట గోపాల కృష్ణ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జె రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో పార్టీల నాయకులు వచ్చి ఏవేవో వాగ్దానాలు చేస్తారన్నారు. ఎన్నికల తరువాత వాటిని మరచిపోయి ప్రజలకు దూరంగా ఉంటారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మాటమీద నిలబడే వ్యక్తిగా అన్ని హామీలు నెరవేర్చి మరోసారి ప్రజల సహకారన్ని కోరుతున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆసరా పథకం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రాదేవి, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, అందరు కౌన్సిలర్‌లు, సచివాలయాల సిబ్బంది, పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

18-19 వయసు ఉన్న యువతను ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ కృతికాశుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో 18-19 వయసు మధ్య ఉన్న యువతను ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ కృతికాశుక్లా కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎన్నికల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లోని అంశాలు, ఈ-ఎపిక్ కార్డుల పంపిణీ, ఈవిఎం, వివిప్యాట్‌ల ద్వారా ఓటింగ్ విధానం వంటి అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియ నిరంతరం కొన సాగుతుందన్నారు. జిల్లాలో ఇంకా ఓటర్లుగా నమోదు కాని 18-19 మధ్య వయసున్న యువత ఉన్నారని వారికి అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె. శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), పెద్దిరెడ్డి రవికిరణ్ (భాజపా), గదులు సాయి బాబా(టీడీపీ), సబ్బారపు అప్పారావు(బీఎస్పీ) కాళ్ళూరి కృష్ణ మోహన్(ఆప్), ఆకులు వెంకటరమణ (ఐఎన్‌సీ) కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న జూనియర్ కళాశాలను పునర్నిర్మించాలి

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లో శిథిలావస్థలో ఉన్న జూనియర్ కళాశాలను తక్షణమే పునర్నిర్మాణం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం శాంతియుత దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవికుమార్, సహాయ కార్యదర్శి కె. వెంకట్ పాల్గొని మాట్లాడారు. కళాశాల శిథిలావస్థకు చేరుకొని 20 సంవత్సరాలు జరిగినప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదని,కళాశాలలో అడ్మిషన్లు రోజు రోజుకీ తగ్గుతూ వస్తున్నాయని తెలిపారు. పూర్వ విద్యా ర్థులు, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కె. రామకృష్ణ,పెద్దిరెడ్డి మహేష్, వి. నరసింహామూర్తి, ఎస్టియు నాయకులు జె. ఏసురాజు, ఏ సూర్య నారాయణ, యుటిఎఫ్ నాయకులు వైవీ రమణ, ఎస్టియు జిల్లా ఉపాధ్య క్షులు కె. సుజాత, ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా మహిళా కన్వీనర్ వెన్నెల, అంజలి, సతీశ్, గణేష్, సందీప్, కుమార్, ఘన, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా లే అవుట్

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని మల్లిపాకలో ఎటువంటి అనుమతులు లేకుండా అనధికార లే అవుట్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామ సర్వే నెంబరు 160/1,2 లోని సుమారు 3 ఎకరాల పంట భూమిలో మట్టిని నింపి లే అవుట్లు వేస్తున్నారు. అక్రమంగా లే అవుట్లు కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి సురేష్‌ను వివరణ కోరగా సర్వే నంబర్ 160/1,2 లో కన్వర్షన్ అయిందన్నారు. అదే విధంగా పంచాయతి కార్యదర్శి శేషగిరి రావును వివరణ కోరగా లే అవుట్‌కు పంచాయితీ నుండి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ లేవుట్ల పై ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులపై కేసు నమోదు చేసి లే అవుట్లను అదుపు చేయాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవటమే అజెండా

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్రంలోను, దేశంలోను కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం ఒక్కటే అజెండా అని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ మట్టా వెంకట శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అమలాపురం రూరల్‌లో జరిగిన జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి నాయకుల సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అమలాపురం పార్లమెంటరీలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రతీ బూత్ లోను బూత్ లెవల్ ఏజెంట్లను తక్షణం నియమించాలని, మండల కాంగ్రెస్ కమిటీలు, పట్టణ కాంగ్రెస్ కమిటీలు తక్షణం నియమించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కామన ప్రభాకర రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రభుత్వ విధానాలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: పొగాకు పురుగుమందు అవశేషాలు లేని నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు రాజమండ్రి రీజినల్ మేనేజర్ ఎం. ఆదిశేషయ్య రైతులకు పిలుపు నిచ్చారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని రామన్నపాలెం కొత్తగూడెం దుమ్మంతును గూడెం బంధపురం దుద్దుకూరు చెరుకుమిల్లి గ్రామాలలో బుధ వారం పొగాకు తోటలను పొగాకు క్యూరింగ్ చేసే విధానమును పొగాకు బోర్డు ఐటిసి ఇతర కంపెనీ ప్రతినిధుల బృందం పరిశీలించింది ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ రైతులు బోర్డు పరిమితిని మించి ఎక్కువ పొగాకు ఉత్పత్తి చేయవద్దని అన్నారు. ముఖ్యంగా పురుగుమందు అవశేషాలు లేని నాణ్యమైన పొగాకును పండించాలని కోరారు. సిటిఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ వై. సుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు పంట ఆరోగ్యకరంగానే ఉందని, రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి క్యూరింగ్ గ్రేడింగ్ లో జాగ్రత్తలు పాటించాలి అన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి జి ఎల్ కే ప్రసాద్ మాట్లాడుతూ పండు గుల్ల ఆకులను ఇతరులకు అమ్మకూడదని పొగాకు వేలం కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తారని అన్నారు. పిఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి టీ. రఘునాధరావు బయ్యర్ సీతారామరాజు సీనియర్ గ్రేడింగ్ అధికారి వి. శివకుమార్, ఆయా గ్రామాలకు చెందిన పొగాకు రైతులు పాల్గొన్నారు.

కలిసి పని చేద్దాం... బర్లతో బత్తుల ఆత్మీయ భేటీ

విశాలాంధ్ర - సీతానగరం: కలిసి పని చేద్దాం అంటూ బత్తుల బలరామకృష్ణ టీడీపీ బిసి సీనియర్ నాయకుడు బర్ల బాబురావుతో ఆత్మీయ భేటీ అయ్యారు. బుధవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బర్ల బాబురావుని వారి స్వగృహంలో రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ గౌరవపూర్వకంగా కలిసి వారికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లడుతూ కలిసి పని చేద్దాం అని రాజానగరం నియోజకవర్గాన్ని వైసీపీ అరాచక, అవినీతి పాలన నుండి రక్షించి.. ఇరు పార్టీల ఆధ్వర్యంలో సుపరిపాలనతో ప్రజా పరిపాలన చేసి చూపిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

సొంత చెల్లికే న్యాయం చేయనివాడు ప్రజలకు ఏం చేస్తాడు

విశాలాంధ్ర-గోకవరం : జగన్ చేతిలో అన్ని వర్గాలు మోసపోయాయని, చివరకు తల్లి,చెల్లి ఇద్దరూ కూడా మోసపోయారని గోకవరం టీడీపీ మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ పేర్కొన్నారు. గోకవరం గ్రామంలో తన స్వగృహం నుండి ప్రెస్ నోట్ విడుదల చేసిన ఆయన ఈ విధంగా స్పందించారు. 57 నెలల పాలనలో పెంచిన అధికరేట్లతో.. చివరకు చెత్త పన్నుతో కూడా ప్రజలను ఇబ్బంది పెట్టాడని, మరొక పక్క నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో జగన్ చలగాటమాడాడని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అండతో వైసిపి నాయకులు, కార్యకర్తలు భూకబ్జాలు, దోపిడీలతో రాష్ట్రంలో అలజడి సృష్టించిన వైసీపీ కబ్జాల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు అవుతుందని అన్నారు. ఒక్క జగ్గంపేట నియోజవర్గంలో జ్యోతుల నెహ్రూ గేట్లు తెరవాలే గాని వైసిపి ఖాళీ అవుతుందని రామకృష్ణ వ్యాఖ్యానించారు.

ఎన్నికల వేళ గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం

విశాలాంధ్ర - సీతానగరం: ఎన్నికల వేళ గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ వేగవంతంగా జరుగుతున్న పనులో కొన్ని చోట్ల పర్యవేక్షణ లోపం ఉంటుంన్నదని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనంతో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చాలా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన వాటిపై కనీసం వాటరింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు, నాయకులు దృష్టి సారించి ప్రజా ధనం వృధా కాకుండా నాణ్యమైన పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నెహ్రూ యువ కేంద్ర జిల్లా సలహాదారునిగా గోపిశెట్టి

విశాలాంధ్ర-కొవ్వూరు : నెహ్రు యువ కేంద్ర జిల్లా అడ్వైజర్ కమిటీ మెంబర్ గా భారతీయ జనతా యువజన విభాగ జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి శివకృష్ణకు నామినేటెడ్ బాధ్యతని ఇచ్చారు. ఈ సందర్భంగా యువజన విభాగాల్లో చురుకైన నాయకునిగా భాజపాలో వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి సహకరిస్తున్న శివకృష్ణ ఎంపిక పట్ల బిజెపి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండలస్థాయి నాయకులు అభినందనలు తెలియజేశారు.

తిలక్ మృతి తీరని లోటు

విశాలాంధ్ర-కొవ్వూరు : రాజమండ్రి పార్లమెంటు తెదేపా ఉపాధ్యక్షులు మలకపల్లి సర్పంచ్ రాపాక తిలక్ బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన మృతితో మలకపల్లిలోనే కాక జిల్లా వ్యాప్తంగా విషాదఛాయలు అలము కున్నాయి. మాజీ ఎమ్మెల్యే కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు తిలక్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ తాను తెదేపాల ఉండగా ఎమ్మెల్యే పదవిలో ఉండగా తిలక్ తన కుడి భుజంగా వ్యవహరించారన్నారు అటువంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ ప్రొక్యూర్ మెంట్ నోటీసు

ఇ-ప్రొక్యూర్ మెంట్ ద్వారా శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము, కడియం గ్రామము మరియు మండలం, తూర్పు గోదావరి జిల్లా నందు దేవాలయమునకు మల్టి కలర్ పెయింటింగ్ వేయుటకు రూ.10.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు కార్యనిర్వాహక అధికారి

ఆడుదాం -ఆంధ్ర క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో ఉంచాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి అకాక్షించారు. బుధవారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లాస్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలను జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ,జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లాను ఆడుదాం-ఆంధ్ర లో మొదటిస్థానం సాధించడానికి క్రీడాకారులు కష్టంతో కాకుండా ఇష్టంతో ఆడాలని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో గ్రామీణ, మండల, నియోజకవర్గ క్రీడాపోటీలు జరిగాయని నియోజకవర్గంలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లాస్థాయిలో క్రీడల్లో పాల్గొని గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయిలో పంపడం జరుగుతుందని తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లోకూడా ప్రోత్సాహం చూపించాలని దీనిద్వారా మానసిక ప్రశాంతత, ధృడసంకల్పం కలుగుతుందని అన్నారు. ఈ క్రీడాపోటీల్లో క్రికెట్, కో-కో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడా రంగాన్ని ప్రోత్సహించే దిశలో ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేశారని, దీనికి జిల్లాలో విద్యార్థులు మంచి స్ఫూర్తిని ఇచ్చారని అన్నారు. అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మహిళల వాలీబాల్ క్రీడను జాయింట్ కలెక్టర్, చైర్ పర్సన్ ఆడి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మానవ మనుగడకు మార్గదర్శకం

విశాలాంధ్ర-నరసాపురం : నర్సాపురం పట్టణ పరిధిలోని క్రీస్తు లూథరన్ దేవాలయము (ఎ క్లాస్ పేరిష్)శత వార్షికోత్స కృతజ్ఞత ఆరాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో మానవునికి సంబంధించి మానవ జీవిత విధి విధానాల గురించి ఏసుక్రీస్తు తాను అనుభవించి మానవాళికి మార్గం నిర్దేశించారన్నారు. ఈ భూమిపై ఎంతో విలువైనది మానవ జన్మ ఈ జన్మలో దైవచింతలతో పాటు సమాజంలోని ఇతరుల పట్ల మానవీయత విలువలను కలిగి ఉండాలని తద్వారా మాత్రమే మానవ జీవితానికి పరిపూర్ణత ఏర్పడుతుందని చెప్పిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

మొదటి రోజు మనసారా ఆసరా కార్యక్రమాలు

విశాలాంధ్ర - ఆచంట : మాజీ మంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆధ్వర్యంలో మొదటి రోజు ఏర్పాటు చేసిన మనసారా ఆసరా కార్యక్రమాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఆచంట నియోజవర్గం స్థాయిలో ఈ కార్యక్రమానికి డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నాలుగు మండలాల నుంచి సుమారు 5000 మంది కార్యక్రమానికి పాల్గొన్న డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు భోజనం పెట్టి చీర అందించారు.

రామాలయానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర - లింగపాలెం : జాయింట్ కలక్టర్ లావణ్య వేణి ముడిచర్లలో పర్యటించారు. గ్రామంలోని రామాలయంలో విగ్రహాలకు కిరీటాలు అందించాలని ఆలయ కమిటీ వారు ఆహ్వానించగా ఈమె విచ్చేశారు. సీతా రాములకు, లక్ష్మణ, ఆంజనేయులకు కిరీటాలు అమర్చారు. కన్నుల పండుగగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ రావి రమాదేవి కొండలు, ఆలయ కమిటీ నాయకులు తాళ్ళూరి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌ను సన్మానించారు. గ్రామానికి విచ్చేసిన ఈమెకు పలు సమస్యలు వివరించగా పరిష్కరిస్తానని తెలిపారు.

నిధులున్నా సద్వినియోగం చేసుకోలేని అసమర్ధ ఎమ్మెల్యే ముదునూరి

విశాలాంధ్ర-మొగల్తూరు: తీర ప్రాంత వాసుల చిరకాల కోరిక మొగల్తూరు మండలంలోని మోడి వంతెన, వియర్ ఛానల్ ప్రాంతాలను బుధవారం నరసాపురం మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా నరసాపురం మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు మాట్లాడుతూ సముద్ర తీరప్రాంత గ్రామాలను మండల కేంద్రం మొగల్తూరుతో అనుసంధానం చేసేందుకు మొగల్తూరు - మోడీ గ్రామాల మధ్య వంతెన నిర్మించాలని ప్రజలు ఐదు దశాబ్దాలుగా కోరుతున్నారని అన్నారు. సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో 4 వేల ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు ఈ నిర్మాణం వియర్ ఛానల్ దోహద పడుతుందని అన్నారు. వియర్ ఛానల్ నిర్మాణం చేపట్టింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నని గుర్తు చేసారు. టీడీపీ అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వియర్ ఛానల్ నిర్మాణానికి నీళ్ళోదిలిందని అన్నారు. ముందుగా శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆంద్రాజు రామన్న తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-వీరవాసరం: ఇటీవల వేరు వేరు చోట్ల మోటారు వాహనాలను దొంగతనం చేస్తున్న మండలంలోని మడుగు పోలవరం పంచాయతీ పరిధిలోని జొన్నలపాలెం గ్రామానికి చెందిన వేంద్ర చంద్రశేఖరరావును అరెస్ట్ చేసి అతని వద్ద నుండి దొంగిలించిన మోటారు వాహనాలను రికవరీ చేసినట్లు వీరవాసరం ఎస్ఐ పి.రమేష్ ఒక ప్రకటన లో తెలిపారు. ఇతనిపై గతంలో కూడా మోటారు వాహనాల దొంగతనం కేసు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన భీమవరం రూరల్ సర్కిల్ ఎస్ఐ వై.సత్య కిశోర్, వీరవాసరం ఎస్ఐ పి. రమేశ్, మరియు సిబ్బంది ని జిల్లా ఎస్పీ ఉప్పాడ రవి ప్రకాష్ అభినందించారు.

టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - తణుకు : పట్టణ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో తణుకు పట్టణం నుంచి పలువురు యువకులు బుధవారం తెలుగుదేశం పార్టీలోకి చేరారు . ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం కుటుంబంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తిఅయ్యిందని ఈ నాలుగున్నర సంవత్సరాలలో యువత భవిష్యత్తును నాశనం చేశాడని విమర్శించారు . చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లు ఇద్దరు కలిసి ఏర్పరిచే ప్రభుత్వం ద్వారా యువతకు న్యాయం జరుగుతుందని నమ్మి తెలుగుదేశం పార్టీలోకి వచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి ఓమ్మి రాంబాబు, నియోజవర్గ ప్రచార కార్యదర్శి తాతపూడి మారుతీరావు, జక్కంశెట్టి వెంకటేష్, మల్లిన రాధాకృష్ణ , సిర్రా సుధాకర్, నక్కా ఈశ్వరప్రసద్, తమరపు పల్లపురావు, మాజి కౌన్సిలర్ సప్పా వీరారఘవులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాకు చెందిన ఎన్నికల సామాగ్రి భద్రపరిచే గోదాంను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీచేసే ప్రక్రియలో బాగంగా సందర్శించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నున్న ఈవిఎం యంత్రాలు, వివిప్యాట్ భద్రపరిచే గోదాం ను సందర్శించి గోదాముకు వేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఎప్పటి కప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాం ను క్షుణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవిఎం గోదాం వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

చిరుధాన్యాలతో రుచికరమైన వంద రకాల వంటలు పుస్తకం అవిష్కరణ

విశాలాంధ్ర - ఏలూరు: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తి కమీషన్ సొసైటీలకు అందించే చర్యలు తీసుకోవాలని జిల్లా సహకారశాఖ అధికారిని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు.బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సలహా మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ప్రచురించిన చిరుధాన్యాలతో రుచికరమైన వంద రకాల వంటలు పుస్తకాన్ని జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తో కలిసి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. సమావేశంలో సభ్యులు చిట్టూరి వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ, జలవనరుల శాఖ ఎస్ ఇ కె. శ్రీనివాసరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజూ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు

విశాలాంధ్ర-నరసాపురం: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, మేజర్, మైనర్, సబ్జెక్ట్, ఇంటర్ షిప్ ప్రాజెక్ట్, స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం ద్వారా నాణ్యమైన విద్యను పొందవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు అన్నారు. వై. యన్. కళాశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కే. రామ్మోహనరావు ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా నుంచి నేక్ ఎం గ్రేడ్ శ్రీ వై యన్ కళాశాలను ఎంపిక చేసామని విద్యార్థినీ విద్యార్థులు అభివృద్ధి పొందాలంటే ముఖ్యమైన విషయాల అవసరమని అవి స్కిల్స్ నవ కల్పనలు యువతరం ఆలోచన విధానం ఈ మూడింటిని మార్చుకుంటూ కొత్త ఆలోచనలతో అనేక నవకల్పనలు చేయడం ద్వారా అనేక కొత్త వ్యాపారాలు స్టార్ అప్స్ వస్తున్నాయి ప్రపంచానికి నిన్ను నువ్వు పరిచయం చేసుకోవాలంటే నీ ఆలోచనలను వదిలిపెట్టి నీ అవసరం ప్రపంచానికి సంస్థలకు ఉన్నదని నిరూపించుకోవాలంటే ముందుగా నీలో స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు.

వై. యన్. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా. చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలి తీసుకొని వస్తున్న సంస్కరణలు వలన ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏకడమిక్, రీసర్చ్ ఎడ్వైజర్, ఆర్.వి. సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డా.చింతపల్లి కనకారావు, పి జి డైరెక్టర్ డాక్టర్ ఎన్. చింతారావు, కళాశాల డీన్ డా. గంధం రామకృష్ణ, ఇంచార్జ్ డైరెక్టర్ డా. ఆర్. పార్ధసారధి, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విధార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి

విశాలాంధ్ర-ఏలూరు: రహదారి కూడళ్ళను దాటేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ కెవిఎస్. ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్స వాల్లో భాగంగా బుధ వారం వట్లూరు సిద్దార్థ విద్యాలయ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో రహదారి భద్రతపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కలిగి ఉండటం వలన రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ జి.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు అజ్మీరా బద్దు, జి.స్వామి, రోడ్డు భద్రతా వైద్యురాలు జి. మౌనిక, ప్రిన్సిపల్ పి.ఎస్.ఎన్.కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ఏలూరు: దెందులూరు మండలం, చల్ల చింతలపూడి గ్రామానికి చెందిన ముమ్మడి వెంకట సత్య నారాయణ కుమార్తె ముమ్మడి మాధవికి వైద్య విద్య నిమిత్తం ముఖ్య మంత్రి జగన్ దృష్టికి తీసుకురాగా ఆమెకు రూ.10 లక్షలు మంజూరు చేసినారు. సదరు మొత్తమును జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వారి అదేశముల మేరకు బుధవారం జాయింట్ కలక్టర్ బి.లావణ్య వేణి ఛాంబర్ లో పది లక్షల రూపాయల చెక్కును అంద చేశారు.

వీధి కుక్కలపై చర్యలేవి ?

విశాలాంధ్ర-గోకవరం: గోకవరం గ్రామంలో ఇటీవల కాలంలో చిన్నపిల్లలపై, మహిళలపై వీధి కుక్కల దాడి బాగా అధికమైందని దీనిని అధికారులు అరికట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి పాలూరి బోసుబాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రామంలో వీధి కుక్కలు స్వైర వ్యవహారం చేస్తున్నాయని చిన్నపిల్లలను, మహిళలను భయంకరంగా గాయపరిస్తూ భీభత్యం సృష్టిస్తున్నాయని వీటిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బోసుబాబు తెలిపారు.ఏదైనా ప్రాణ నష్టం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని బోసు బాబు అధికారులను ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికై జిజిహెచ్ శానిటేషన్ వర్కర్ల ఆందోళన

విశాలాంధ్ర - కాకినాడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్ కుమార్, మహిళా నేత జె లక్ష్మీప్రియలు మాట్లాడుతూ 2021 నుండి జిజిహెచ్‌లో శానిటేషన్ నిర్వహణ కాంట్రాక్టు పొందిన కృష్ణా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు గతంలో ఎన్నడూ లేని విధంగా పిఎఫ్ చెల్లింపుల్లో యజమానులు చెల్లించవలసిన వాటా కూడా కార్మికుల జీతాల నుండి కత్తిరింపులు చేసారని తెలిపారు. ఇప్పటి వరకు చాలా సార్లు విన్నవించిన తరువాత ఆందోళన బాట పట్టామన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేసేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణలతో పాటు యూనియన్ నాయకులు ఆర్ రమేష్, జె శేషు, ఎస్ వాసు, కృష్ణవేణి, రమణమ్మ, పుష్ప, తలుపులమ్మ, భాగ్యలక్ష్మి, డి దుర్గా ప్రసాద్, బి శ్రీకాంత్, ఎం ఏసు, ఎం రవి, వసంత్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో బంగారం చోరీ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ర్యాలీ గ్రామ శివారు బుల్లియ్య రేవులో ఒక ఇంటి తాళం బద్దలు కొట్టి 15 గ్రాముల బంగారం దొంగతనం చేశారని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై కిరణ్ కుమార్ తెలిపారు. ఆధారాల సేకరణ కోసం క్లూస్ టీమ్ సిబ్బంది మరియు ఎస్సై ప్రవీణ్ కుమార్ వచ్చి వేలి ముద్రలు సేకరిస్తున్నారు. చోల్లంగి బంగారయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బంగారం దొంగలించారు. బాధితుడు ఆత్రేయపురం స్టేషన్‌కి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బివై కిరణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఉదయం11 గంటలకు బయటకు వెళ్లి తిరిగి 12.30కు వచ్చే సరికి దొంగతనం జరిగింది. దొంగతనాలు మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంగిరెడ్డి కుటుంబానికి ముద్రగడ పరామర్శ

విశాలాంధ్ర - సామర్లకోట : ఇటీవలి మృతి చెందిన గంగిరెడ్డి స్వామి నాయుడు కుమారులైన వెంకటరమణ, బలరాం, కృష్ణమూర్తిలను మాజీ

మంత్రి కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సామర్లకోటలో చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ఇంటి వద్దకు చేరుకుని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ముద్రగడతో గంగిరెడ్డి కుటుంబ సభ్యులకు మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. కుటుంబ సభ్యులతో సుమారు గంటపాటు మాట్లాడారు.

కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరుణకుమారి దరఖాస్తు దాఖలు

విశాలాంధ్ర-కొవ్వూరు : రాబోయే శాసన సభ ఎన్నికలు నిమిత్తం కొవ్వూరు నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేయుటకు విజయవాడ

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. కొవ్వూరులో ఆమె బుధవారం మాట్లాడుతూ ఈసందర్భంగా రాష్ట్రంలో డా వై ఎస్ రాజశేఖరరెడ్డి తనయ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరిన తరువాత మరింత ముందుకు వెళ్ళుటకు అవకాశం వచ్చింది అని అరుణకుమారి అన్నారు. ఆమె వెంట పి సిసి డెలిగేట్ గెద్దం సాయి బాబా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు కొణిదల శ్రీనివాస్, చాగల్లు మండలం ప్రెసిడెంట్ బోనిగే రాంబాబు, కొయ్యే వెంకట్ రావు, అరిగెల శ్రీనివాస్, సత్య నారాయణ ఉన్నారు.

వైసీపీ విజయానికి పనిచేయాలి

విశాలాంధ్ర -కొవ్వూరు : వైసీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం కాపవరం, చాగల్లు గ్రామాలలో తలారి వెంకట్రావు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారం చేపట్టే విధంగా గోపాలపురం నుండి తనను కొవ్వూరు పంపించారని తెలిపారు.

బదిలీపై వెళుతున్న ఎంపీడీవోకు చిరు సత్కారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎంపీడీవోగా పనిచేస్తున్న యమ్‌విఆర్ కుమార్ బాబు ఎన్నికల ప్రక్రియలో భాగంగా కృష్ణాజిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, వైసిపి సీనియర్ నాయకులు, మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయితీ కార్యదర్శులు కలిసి ఎంపీడీవో కుమార్ బాబుని శాలువాలు, బొకేలుతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరెంటెంట్ జే శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, జూనియర్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు డి శ్రీనివాసరావు, ఏఎస్ఎన్ మూర్తి, బి. వీరబాబు, లక్ష్మీనారాయణ గంగాభవాని, వైసిపి నాయకులు పిన్నిసెట్టి ప్రకాష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తెలుగుదేశం పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరంలో బుధవారం జరిగిన జయహో బీసీ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సత్య ప్రభ మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆదరణ

పథకం ద్వారా చేతి వృత్తిదారులకు పనిముట్లు, రైతులకు ట్రాక్టర్లు ఇతర సామాగ్రి అందజేయడం జరిగిందని అన్నారు. బీసీ యువత ఉపాధి కోసం రాయితీపై ఆటోలు, లారీలు, కుటీర పరిశ్రమలకు యంత్ర సామాగ్రి అందజేస్తే ప్రస్తుత ప్రభుత్వం అవన్నీ తుంగలోకి తొక్కిందన్నారు. చంద్రన్న బీమా ద్వారా ఎవరైనా మృతి చెందితే మట్టి ఖర్చులకు వెంటనే 5 వేల రూపాయలు, అనంతరం 2 లక్ష రూపాయలు కుటుంబానికి భరోసా ఇచ్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లక్షల రూపాయలు రుణాలు అందజేసి అనేక కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడి మాజీ బీసీ మంత్రులపై అక్రమ కేసులు బనాయించిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు, విధులు లేకుండా కులాల ప్రాతిపదికన కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది తప్ప ఒక్క రూపాయి ఆ కులాలకు అందలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 22 నుంచి ఉత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ట మార్చి 22 నుండి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని సిద్ధాంతి రావిపాటి వెంకట వరప్రసాద్ తెలిపారు పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం దాదాపు కోటి 50 లక్షల రూపాయలు వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు బుధవారం సాయంత్రం ఎర్నగూడెంలో ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముహూర్త నిర్మించారు చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన సిద్ధాంతి రావిపాటి వెంకట వరప్రసాద్ ముహూర్తం పెట్టారు 2024 మార్చి 25 పాల్గొన్న మాసం పౌర్ణమి రోజు ఉదయం 8 గంటల 21 నిమిషములకు ఉత్తరా పాల్గొని నక్షత్రమున ముహూర్తం నిర్ణయించారు ఈ సందర్భంగా ఆలయం నిర్మాణం దాత శ్రీకాకుళపు కాశీ విశ్వనాథ మాట్లాడుతూ ఎర్నగూడెంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని కోరికతో గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు మార్చి 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆలయం వద్ద వివిధ పూజా కార్యక్రమాలు హోమాలు నిర్వహిస్తామని తెలిపారు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి విగ్రహం సలహాలు విగ్రహం ఉంటుందని తెలిపారు ఆరు అడుగుల మూడు అంగుళాలు ఎత్తు విగ్రహం ఉంటుందని తెలిపారు స్వామివారి వస్త్రా స్థలంలో చతురస్రాకారంలో నాగలక్ష్మి అమ్మవారు ఉంటారని తెలిపారు తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యం జరిగే పూజా విధానం ఈ ఆలయంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళపు వెంకట నరసింహారావు శ్రీకాకుళపు కాళీకృష్ణ తీగల బలరామయ్య నువ్వులు వెంకట్రావు నువ్వులు శ్రీనివాస్ బల్ల వెంకటేశ్వరరావు నరహరిశెట్టి సుధాకర్ పత్తిపాటి హరినాథ్, గద్దె శ్రీనివాస్, స్వామీజీ, రవికుమార్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్య నిమిత్తం ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పాతూరి సాయి హర్షిని కళాశాల ఫీజు నిమిత్తం మాజీ పార్లమెంట్ సభ్యులు మాగంటి బాబు కుమార్తె మాగంటి శ్రీరవళి,తన సొంత నిధుల నుంచి రూ.65వేలు అందజేశారు.

హెూండా ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రతి వ్యక్తి యొక్క భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని హెూండా మోటార్స్ స్కూటర్ ఇండియా హెచ్ఎంఎస్ఐ అభిప్రాయపడింది. రోడ్డు భద్రతపై అవగాహన లక్షలాది మంది పౌరులకు చేరేలా చేసేందుకు, దేశంలోని వివిధ ప్రాంతాలలో తరచూ రోడ్డు భద్రత అవగాహన ప్రచారాలను సంస్థ నిర్వహిస్తోంది. అటువంటి ప్రచారం ఇటీవల రాజమండ్రి నగరంలో జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారిపై శాశ్వత ప్రభావాన్ని చూపింది. భాష్యం పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఎంఎస్ఐ అపూర్వమైన మైలురాయిని సాధించింది. ఇక్కడ అది 2100కంటే ఎక్కువ మంది పాఠశాల విద్యార్థులు మరియు సిబ్బంది సభ్యుల క్రియాశీల భాగస్వామ్యాన్ని చూసింది. ఈ ప్రచారంలో భాగంగా స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్ పోటీ, రోడ్ సేఫ్టీ క్విజ్ మరియు ఆర్టికల్ రైటింగ్ కాంపిటీషన్ వంటి కార్యకలాపాలను నిర్వహించారు. పిల్లలే ఈ సమాజానికి భవిష్యత్తు అని హెచ్ఎంఎస్ఐ బలంగా విశ్వసిస్తోంది మరియు రోడ్డు భద్రతపై ప్రాథమిక దశలోనే వారికి అవగాహన కల్పించడం వల్ల రోడ్డు ప్రమాదాలు లేకుండా చేయడంలో దోహదపడుతుందని నమ్ముతుంది. ఇది తరచూ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది. పిల్లల నుండి యువత వరకు అనేక రకాల వయస్సు వర్గాలకు మరియు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

నిబద్ధతగల కమ్యూనిస్టు రామసుబ్బయ్య

విశాలాంధ్ర-చల్లపల్లి : నిబద్ధతగల కమ్యూనిస్టు కామ్రేడ్ మల్లుపెద్ది రామసుబ్బయ్య అని సీపీఐ, రైతు సంఘం నాయకులు పరుచూరి శ్రీనివాసరావు ప్రశంసిం చారు. దివిసీమ కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు, కృష్ణా జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్, వక్కలగడ్డ పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు మల్లుపెద్ది రామ సుబ్బయ్య 4వ వర్ధంతి మండల పరిధిలోని వక్కలగడ్డలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ కామ్రేడ్ రామసుబ్బయ్య నిబద్ధతగల కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, పేద ప్రజలందరి వాడీగా ప్రశంసలందుకున్నారని కొనియాడారు. పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రామసుబ్బయ్య అనేక భూ పోరాటంలో కీలక భూమిక పోషించారని అన్నారు. వక్కలగడ్డ గ్రామాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దటంలో పార్టీలకతీతంగా పనిచేసేవారిని కొనియాడారు. తాను నమ్మిన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల కోసం కడవరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా జీవితాన్ని గడిపారని తెలిపారు. వక్కలగడ్డ గ్రామాభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ మార్కు వేసిన రామసుబ్బయ్య ఈ తరం నాయకు లకు ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి రామ సుబ్బయ్య అహర్నిశలు కృషి చేసే వారిని ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని ఈ తరం నాయకులు కమ్యూనిస్టు పార్టీ గ్రామ స్థాయి నుండి బలోపేతానికి కృషి చేయడమే ఆయనకి నిజమైన నివాళి అన్నారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి అద్దాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పరి తపించే రామసుబ్బయ్య వక్కలగడ్డలో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించే వారన్నారు. ఆయన చూపిన బాటలోనే వారి వారసులు సైతం నడుస్తూ పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. రామ సుబ్బయ్య కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టు పార్టీ కుటుంబాలు పార్టీ బలోపేతం కోసం తమ వంతు సహకారం అందిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.